నేడు జీఐఎల్‌టీలో 'సృజన టెక్ ఫెస్ట్'

రాయదుర్గం: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాయదుర్గంలోని గవర్న మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో గురువారం 'సృజన టెక్‌ఫెస్ట్' పేరిట ప్రత్యేక టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ ఎస్.ఎక్బాల్‌హుస్సేన్ తెలిపారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో ఉదయం 9.30 గంటలకు స్పెషల్ బ్రాంచ్ క్లస్టర్ కోసం జిల్లాస్థాయి రంగారెడ్డిజిల్లా సృజన టెక్‌ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫెస్ట్ ద్వారా విద్యార్థులలో సాంకేతిక ప్రాజెక్టుల ద్వారా వినూత్న ఆలోచన, ఆచరణాత్మక నైపుణ్యాలను ప్రోత్సహించడమే ఈ ఫెస్ట్ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులకు కూడా తమలోని సృజనాత్మకతను, నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలను వెలికితీసేందుకు అవకాశం కల్పించినట్లవుతుందన్నారు. అత్యుత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి రాష్ట్రస్థాయి సృజన టెక్‌ఫెస్ట్ పోటీలకు పంపుతామని ఆయన వివరించారు.

సయ్యద్ రహమాన్‌కు పీహెచ్‌డీ



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థి సయ్యద్ ఇనాముర్ రహమాన్‌కు పీహెచ్‌డీ డిగ్రీని బుధవారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అనువాద అధ్యయనాల విభాగంలో ఆయన పరిశోధక విద్యార్థిగా కొనసాగుతున్నారు. ఆయన 'మహాత్మాగాంధీ సే ముతల్లిక్ అంగ్రేజీ కిలాబోన్‌కీ ఉర్దూ తరాజిమ్: ఏక్ జాయేజా' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను ఆయన సమర్పించారు. ఆయన ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ మహమూద్ కజ్మీ పర్యవేక్షణలో ఈ పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఆయనను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

రహదారి విస్తరణ ఎప్పుడో ?

- శంకుస్థాపన చేసి నాలుగేళ్లు గడిచినా పడని ముందడుగు
- అసంపూర్తి పనులతో వాహనదారులకు నిత్యం ఇక్కట్లు



ఒకవైపే కల్వర్టు పనులు పూర్తిచేసిన దృశ్యం

హఫీజ్‌పేట్: రోడ్డు విస్తరణ అసంపూర్తిగా నిలిచిపోయింది. ఏళ్ళు గడుస్తున్నా.. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ కమాన్ వరకు 1.4 కిలోమీటర్ల వరకు సుమారు రూ.4 కోట్లతో 150 ఫీట్ల రోడ్డు విస్తరణ కళగా మిగిలిపోనుందా.. అని స్థానికులు వాపోతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు విస్తరణ నిలిచిపోయిందంటూ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జల మండలి అధికారుల సమన్వయ లోపంతో రోడ్డువిస్తరణ జరగడంలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఉన్నతాధికారులు రోడ్డు విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- శ్రీదేవి థియేటర్ వద్ద కల్వర్టు పనులకు రూ.1.98 కోట్లు కేటాయించినా ఇప్పటి వరకు కొంతమేర మాత్రమే నిర్మించారు.
- నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేశారు. అసంపూర్తిగా రోడ్డు విస్తరణ నిలిచిపోవడంతో అయోమయంలో వివిధ కాలనీవాసులు ఉన్నారు.
- రోడ్డుకు మధ్యలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో కొంతమేర విస్తరణకు ఆటంకంగా మారింది.
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల తొలగింపు కోసం రూ.1.68 కోట్లు విద్యుత్‌శాఖ అందించిన ఆ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదనే విమర్శలున్నాయి.
- కల్వర్టు వద్ద తాగునీటి పైపులైన్ పక్కకు తరలింపుపై కూడా అలసత్వంతో విస్తరణకు అడ్డంకిగా మారింది. కల్వర్టు ఓవైపు మాత్రమే నిర్మించారు.
- రోడ్డుపై కూరగాయాల సంత, చిరువ్యాపారుల దుకాణాలు ఏర్పడటంతో వాహనదారులకు తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురౌతుంది.



అసంపూర్తిగా పనులతో కల్వర్టు రోడ్డు ఇలా..

ట్రాన్స్‌ఫార్మర్లు తొలగిస్తే పనులు ప్రారంభిస్తాం..

శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణలో కొంతమేర పనులు పూర్తయ్యాయి. మరికొంత మేర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కల్వర్టు పనులు మిగిలి ఉన్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగిస్తే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తాం. జోనల్ కమిషనర్ రూ.2 కోట్లు నిధులకు రోడ్డు విస్తరణకు విడుదల చేశారు. రోడ్డు విస్తరణ త్వరతగతిన పూర్తిచేస్తాం.

– శ్రీకాంతి, ఈఈ, సర్కిల్ 21

అధికారుల నిర్లక్ష్యంతోనే పనుల్లో జాప్యం..

2018లో 150 ఫీట్ల రోడ్డు విస్తరణ చేస్తామని కోట్లాది రూపాయలతో అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. కానీ ఆ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నిత్యం ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. నిధులు విడుదలైన, అధికారుల నిర్లక్ష్యంతోనే పనులు ముందుకుసాగడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు విస్తరణ పూర్తయ్యేలా చూడాలి.

– కామేశ్వరరావు, చందానగర్

23న ముక్కోటి ఏకాదశి వేడుకలు

ఉదయం 6 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వారదర్శనం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ వేడుకలను ఆలయ అర్చకుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. ఆలయంలో తెల్లవారుజామున 4.30 గంటలకు కాగడ హారతితో వేడుకలను ప్రారంభిస్తామని, అనంతరం 5 గంటలకు వినాయక, దత్తాత్రేయ, షిర్డీసాయిబాబా వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామని ప్రకటించారు. 6 గంటల నుంచి భక్తులు షిర్డీసాయిబాబా వారికి ప్రత్యేకంగా ఉత్తర ద్వారం నుంచి దర్శించుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే అవకాశం ఉండటంతో భక్తులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి రాజీవ్ గృహకల్పలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మతపెద్దలు కార్పొరేటర్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బేరక చర్చి పాస్టర్ ప్రభుదాస్, సీనియర్ పాస్టర్ యేసుపాదం, పాస్టర్స్ శామ్‌బాబు, జో బాబు, పీవీ రత్నం, రమేష్‌బాబు, సుందర్, వార్డు మెంబర్లు శ్రీకళ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు

రాయదుర్గం: అయ్యప్ప భక్తులు శబరిమలకు బయలుదేరారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడ నుంచి బుధవారం రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో ఇరుముడులు కట్టుకొని గురుస్వామి గోపాల్ ఆధ్వర్యంలో బయలుదేరారు. అంతకుముందు ఆశ్రమంలో అయ్యప్ప స్వామికి భక్తులంతా కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

సహస్ర రుద్రసహిత చండీయాగం



మాట్లాడుతున్న స్వరూపనందేంద్ర సరస్వతిస్వామి

శేరిలింగంపల్లి: చందానగర్ శిల్ప ఎన్‌క్లేవ్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠ పాలిత శ్రీలక్ష్మి దేవాలయంలో శ్రీ సహస్ర రుద్రసహిత చండీయాగంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం శ్రీ గణపతి పూజ, శ్రీలక్ష్మీ గణపతిహోమం, రుద్రహోమం, చండీనవాక్షరిహోమం, అంగ దేవతా హోమాలు చేశారు. ఈ వేడుకలకు శ్రీ విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపనందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి హాజరయ్యారు. దేవాలయ ఫౌండర్ చైర్మన్ యూ.వీ.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు నిధి ఆప్కే నిఖత్...

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిధి ఆప్కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా. హేమంత్ తెలిపారు. గురురవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఖాతాదారులు కండ్లకోయలోని నీరజ్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో,మేడ్చల్ జిల్లాకు చెందిన ఖాతాదారులు కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, బహదూర్‌పల్లిలోని ఆహ్లాద ఇంజినీర్స్ క్యాంపస్‌లో హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామరన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఇఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ తదితర ప్రాంతాల ఖాతాదారులు పాల్గొనవచ్చునని తెలిపారు.

కేవైసీ అప్‌డేట్ కోసం ఉరుకులు.. పరుగులు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ పొందాలంటే ఆధార్ వివరాలు, గ్యాస్ బిల్లులతో వచ్చి కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని ప్రచారం జరగడంతో ఏజెన్సీల వద్ద వినియోగదారులు బుధవారం బారులు తీరారు. కూకట్‌పల్లిలోని ట్రినిటీ ఇండేన్‌గ్యాస్ ఆఫీస్ వద్ద జరిగిన తోపులాటలో కార్యాలయ ఉద్యోగి ఒకరికి గాయాలయ్యాయి. ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి విధి విధానాలు ప్రకటించకపోయినా సోషల్ మీడియాలో ప్రచారంతో వినియోగదారులు గ్యాస్ ఆఫీసులకు పోటెత్తారు.

'మనూ' ఎంపవరింగ్‌కు కేంద్రం నిధులు



ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనాభవనం

రూ.95 కోట్ల నిధుల కేటాయింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంపవరింగ్ టెక్నాలజీ కోసం కేంద్రప్రభుత్వం రూ.95 కోట్ల నిధులను మంజూరు చేసింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం (సీఎస్ అండ్ ఐటీ) కోసం భారత ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ రూ.95 కోట్లను మంజూరు చేసింది. సీఎస్ అండ్ ఐటీ స్కూల్ చీఫ్ ఇన్వెస్టిగేటర్, డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ ఆధ్వర్యంలో 'వర్చువల్ రియాలిటీ బేస్డ్ అసిస్టెవ్ సిస్టమ్ ఫర్ లెర్నింగ్ అండ్ అసెస్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ ఆఫ్ ఇంటెలెక్చువల్ డిసేబిలిటీస్' అనే ప్రాజెక్టు కోసం ఈ నిధులను పొందడం ద్వారా అన్ని అంచనాలను అధిగమించింది. ఈ ప్రాజెక్టు అమలుకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సర్వీసెస్ ఇన్కార్పొరేటెడ్ (ఎన్ఐసీఎస్ఐ), ఉర్దూ విశ్వవిద్యాలయం సహకరిస్తాయి.

వైస్‌చాన్స్‌లర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభినందన..

కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులను రూ.95 కోట్లు సాధించినందుకు ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ బృందాన్ని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు. సమాజంలోని అట్టడగు వర్గాలకు సేవచేయడం, వారిని ఉద్ధరించడంలో ఈ మార్గదర్శక ప్రయత్నం నిరంతర విజయం, సుదూర ప్రభావంపై ఆయన చాలా ఆశలు వ్యక్తం చేశారు. తరుచుగా నిర్లక్ష్యం చేయబడిన లేదా తక్కువ సేవలందించే వారి అత్యవసర అవసరాలను తీర్చేందుకు ప్రాజెక్టు కరుణ, సానుభూతిని వ్యక్త పరుస్తుందన్నారు. సామాజిక సంక్షేమానికి ఉద్దేశించిన ప్రాజెక్టులకు పెరుగుతున్న గుర్తింపు, మద్దతును ఈ నిధుల మంజూరు ద్వారా నొక్కి చెబుతున్నాయన్నారు.

నేడు కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట రూ.25, పచ్చిమిర్చి రూ.50 , బెండకాయ 60, కాకర 60, దొండకాయ 70, దోసకాయ 40, ఆలుగడ్డ 25, చామ 50, కీర 30, బీర 70, వంకాయ 60, గోకర 65, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 70, ఉల్లి రూ.60 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) రూ.30-40, అల్లం కిలో రూ.250, వెల్లుల్లి కిలో రూ.250 గా ఉన్నాయి.

'షీటీమ్స్' ఫిర్యాదులు

గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మహిళలు షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయాలంటే ఈ క్రింది నంబర్లకు వాట్సప్ లేదా ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

- సైబరాబాద్ షీ టీమ్స్ సందేశాలు పంపాల్సిన నెంబరు 9490617444
- బాలానగర్- 9490617 349
- ఐటీకారిడార్- 9490617352
- మాదాపూర్-8333993519
- కూకట్‌పల్లి- 9493626811
- జగద్గిరిగుట్ట- 9493624561
- మియాపూర్- 9491051421
- పేట్ బషీరాబాద్- 7901114137
- శంషాబాద్- 9490617354
- డయల్- 100కు కూడా ఫిర్యాదు చేయొచ్చు

రోగాల ఆధారంగా చికిత్స

ప్రొఫెసర్ ప్రకాష్

పటాన్‌చెరు: వ్యక్తిగత జన్యుపరమైన వ్యత్యాసాలకనుగుణంగా ఆయా రోగాల ఆధారంగా చికిత్స అందజేయాల్సి ఉంటుందని హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ డాక్టర్ ప్రకాష్ పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో బయోమెడికల్ పరిశోధనలపై రెండు రోజుల జరిగే వర్క్ షాప్ తొలిరోజైన బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 'క్యాన్సర్ చికిత్స కోసం ఔషధ ఆవిష్కరణలో ఆధునిక పోకడలు'పై ఆయన ప్రసంగించారు. క్యాన్సర్ పరిశోధన, మూల కణాలు, మూర్చ, మెదడులో కణితి, జంతు పరిశోధన ప్రాముఖ్యతను ప్రస్తావించారు. ప్రయోగశాలలో ఎలుకలు, కుందేళ్లు వంటి చిన్న జంతువుల నిర్వహణ, వాటితో వ్యవహరించే తీరుపై ఫార్మసీ విద్యార్థులకు స్వీయ అనుభవం అత్యంత ఆవశ్యకమని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడిఎల్ రంగధాముని చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈ నెల 23న శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం, గోపూజ, జనవరి 6న రంగనాథ స్వామి అభిషేక మహోత్సవం, ఆదివారం తులసి దలార్చన, సాయంత్రం 5 గంటలకు దీపోత్సవం, 11న కుడారై ఉత్సవం స్వామికి 108 పాత్రలతో ప్రసాద నివేదన, 14న ఉదయం 10 గంటలకు రంగనాయక స్వామి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యుత్‌లైన్ల పరిశీలన



నానక్‌రాంగూడలో విద్యుత్‌లైన్లను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకన్న

గచ్చిబౌలి: విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా ఉండేందుకు విద్యుత్ లైన్లను విద్యుత్ అధికారులు పరిశీలించారు. బుధవారం ఎస్ఈ వెంకన్న ఆధ్వర్యంలో నానక్‌రాంగూడలో ఒరిగిన స్తంభాలను, వేలాడిన విద్యుత్ వైర్లను పరిశీలించారు. విద్యుత్ లైన్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో విద్యుత్ లైన్ల సమస్యలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గచ్చిబౌలి డీఈ గోపాలకృష్ణ, ఏఈ వేణుగోపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: చెత్త సేకరించే పారిశుధ్య కార్మికులు సమయపాలన పాటిస్తూ ఆయా కాలనీలో ఇంటింటికి తిరిగి సకాలంలో చెత్తను సేకరించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలో బుధవారం పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలించారు. ఇళ్లల్లో చెత్త తొలగింపు విషయంలో ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. చెత్త సేకరణ చేసే వాళ్లంతా తప్పకుండా తమకు కేటాయించిన కాలనీలలో సమయపాలన పాటిస్తూ, ప్రతి గృహంలో ఖచ్చితంగా చెత్తను సేకరించాలని సూచించారు. కార్మికులకు ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

నేడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

కూకట్‌పల్లి: నవ్యాంధ్ర అభివృద్ధి ప్రదాత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఉదయం కూకట్‌పల్లి, బాలాజీనగర్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ అభిమానులు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ నుంచి రమ్యా గ్రౌండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్, జగన్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ఈ ఉత్సవాలు జనవరి 15 వరకు కొనసాగనున్నాయి. రోజూ ఉదయం ఆరాధన సేవ, మంగళశాసనం, తీర్థ ప్రసాద గోష్టి ఉంటుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి జీఏకే కృష్ణ తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సురభి కళామందిరంలో నాటక ప్రదర్శన



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో సురభికాలనీలో శ్రీ ఆవేటి మనోహర్ సురభీ కళా మందిరం రంగస్థల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఆంధ్ర నాటక కళోద్ధారక స్వర్గీయ వనారాస గోవిందరావు 70వ వర్ధంతి సందర్భంగా రెండ్రోజుల పాటు నాటిక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సురభి జాతికి, నాటక రంగానికి వనారాస గోవిందరావు చేసిన సేవలను గుర్తు చేశారు. కమిటీ ప్రతినిధులు రఘునాథ్, చంద్రశేఖర్, కోదండరావు, విజయానంద్, రమణ, బార్గవ, వేణుమాధవ్, సురభీ కళాకారులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

గచ్చిబౌలి: అతివేగంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు అదుపుతప్పి మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జేమ్స్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. లుఖురా గ్రామం, సొనారి పట్టణం, చరైడియో జిల్లా అస్సాంకు చెందిన జాదు ఫుకోన్ (25) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలసవచ్చాడు. హిరాస్ ఎంటర్‌ప్రైజెస్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితుడు బికాష్ బోరా (22)తో కలిసి 17న అర్ధరాత్రి స్కూటీపై గౌలిదొడ్డి నుంచి గోపన్‌పల్లి వైపు వెళ్లారు. మార్గమధ్యంలో హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపంలో స్కూటీ అదుపు తప్పి కిందపడిపోయారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. జాదు ఫుకోన్ 18న రాత్రి 11 గంటలకు మృతి చెందగా.. బికాష్ బోరా బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్యచేసిన భర్తకు రిమాండ్



రాజేశ్వరీ (ఫైల్)

మియాపూర్: భార్యాభర్తల గొడవ కాస్తా భార్య హత్యకు దారితీసిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ రుద్రూర్‌కు చెందిన కుమ్మరి రాజేష్(40). బోధాన్‌కు చెందిన కుమ్మరి రాజేశ్వరి(36) భార్యభర్తలు, వీరికి ఇద్దరు కుమారులు సంతానం. కాగా 2011లో భార్య రాజేశ్వరితో కలిసి నగరానికి వచ్చి మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీలో ఉంటూ.. కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. గత రెండేళ్ల నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈనెల 10న గండి మైసమ్మ దగ్గర ఫంక్షన్ ఉందని, సాయంత్రం సమయంలో భార్య రాజేశ్వరీతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. దుండిగల్ ఓఆర్ఆర్ పక్కన ఉన్న బోరంపేట సర్వీస్ రోడ్డు మధ్యలో నిర్మానుష్య ప్రదేశంలోకి భార్యను బలవంతంగా లాక్కెళ్లి బండరాయితో తలపై మోది హత్య చేశాడు. మృతదేహాన్ని పక్కనే ఉన్న కల్వర్టు కింద పడేసి తిరిగి ఇంటికొచ్చాడు. అనుమానం రాకుండా భార్య ఫోన్ నుంచి తరుచూ అతని ఫోన్‌కు కాల్స్ చేసుకున్నాడు. 13న బావ బాల్‌రాజ్‌కు ఫోన్ చేసి భార్య రాజేశ్వరీ గురించి ఆరా తీశాడు. రాజేష్‌పై అనుమానం వచ్చిన మృతురాలి తల్లిదండ్రులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 14న ఫిర్యాదు చేశారు. 19న పోలీసులు తమదైన శైలిలో అతడిని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా కుళ్లిపోయిన స్థితిలో రాజేశ్వరీ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.